క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రహరీగోడ కూల్చివేత

తవణంపల్లె: ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ గెలుపొందడంతో మండలంలోని తెల్లగుండ్లపల్లెలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేశాడని మంగళవారం సాయంత్రం తెల్లగుండ్లపల్లె ఎస్టీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణమూర్తి యాదవ్ ఇంటి ప్రహరీగోడను జేసీబీతో కూల్చివేశారు. కృష్ణమూర్తి యాదవ్‌కు చెందిన జేసీబీ పట్నం సమీపంలో ప్రతాప్‌రెడ్డి మామిడి తోటలో ఉంచాడు. టీడీపీ నాయకులు పథకం ప్రకారం పట్నం సమీపంలో ప్రతాప్‌రెడ్డి మామిడి తోటలోని కృష్ణమూర్తియాదవ్ జేసీబీని తీసుకెళ్లి తెల్లగుండ్లపల్లెలో అతని ప్రహరీగోడను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న తవణంపల్లె పోలీసులు తెల్లగుండ్లపల్లెకు చేరకుని దాడులను అడ్డుకున్నారు. అంతకు ముందు తెల్లగుండ్లపల్లెలోని వైఎస్సార్‌సీపీ జెండాను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు.

జోరు వాన

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో మంగళవారం జోరువాన కురిసింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతాల్లోం ప్రారంభమైన వర్షం గంటపాటు కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో వర్షపు నీరు ప్రవహించింది. ఇక వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

చల్లంగా చూడు గంగమ్మ తల్లీ

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో మంగళవారం గంగ జాతరను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యమ్మ తల్లికి అభిషేకం, పూజలు చేసి, చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆరివేణి గంగమ్మ తల్లికి పొంగళ్లి పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు.

జూలైలో పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలో టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై నాలుగో తేదీ తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. జూలై మూడవ తేదీ బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం7 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు.

పలమనేరులో టీడీపీ గెలుపు

- అన్ని రౌండ్లలో టీడీపీకి ఆధిక్యత
- 20,122 ఓట్ల మెజారిటీతో మాజీ మంత్రి విజయం


అమరనాథరెడ్డి డిక్లరేషన్ ఫాంను అందజేస్తున్న ఆర్వో మనోజ్‌రెడ్డి

పలమనేరు: పలమనేరు నియోజకవర్గ ఓటర్లు టీడీపీకి పట్టం కట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి ఎన్ అమర్‌నాథ రెడ్డి తన సమీప వైఎస్సార్ సీపీ ప్రత్యర్థి వెంకటేగౌడపై 20,122 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. పలమనేరు అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ చిత్తూరు సమీపంలోని ఎస్వీసెట్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. మొత్తం 21 రౌండ్లలోనూ టీడీపీ ఆధిక్యం కనబరచింది.

బరిలో ఉన్న అభ్యర్థులు 14మంది

వివిధ రాజకీయ పార్టీల నుంచి నలుగురు, ఇండిపెండెంట్లు పదిమంది మొత్తం 14మంది బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్ వెంకటేగౌడ(ఫ్యాను) టీడీపీ నుంచి ఎన్ అమరనాథ రెడ్డి(సైకిల్) మధ్యే పోటీ కొనసాగింది.

రౌండ్ల వారీగా కౌంటింగ్ వివరాలు

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొత్తం 21 రౌండ్లలోనూ టీడీపీకి ఆధిక్యత లభించింది. పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీకి 1,534 వైఎస్సార్‌సీపీకి 514 ఓట్లు దక్కాయి. ఫలితంతో టీడీపీ శ్రేణులు ఆనందంలో మునిగాయి. నియోజకవర్గంలోని మాజీమంత్రి సొంత మండలమైన పెద్దపంజాణితో మొదలై ఆపై గంగవరం, బైరెడ్డిపల్లె, వీ.కోట, పలమనేరు రూరల్, పలమనేరు మున్సిపాలిటీల్లోనూ టీడీపీకే ఆధిక్యత లభించింది. దీంతో అమర్‌నాథరెడ్డి 20,122 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అమర్‌నాథ రెడ్డి గెలుపును ధృవీకరిస్తూ ఎన్నికల అధికారి ఆయనకు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.

పట్టణంలో టీడీపీ అభిమానుల కోలాహలం

రాష్ట్రంలో టీడీపీ కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంతోపాటు స్థానికంగా మాజీ మంత్రి గెలవడంతో ఆపార్టీ శ్రేణులు బాణసంచా కాలుస్తూ సంబరాలతో హోరెత్తించాయి. పోలీసులు హెచ్చరించనా ఆ పార్టీ శ్రేణులు మాత్రం ఖాతరు చేయకుండా హంగామా చేశాయి. మొత్తం మీద ఆ పార్టీ నాయకులు అనవసర హైరానా చేయకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

టీడీపీ అభ్యర్థికి డిక్లరేషన్

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి ఎన్ అమరనాథరెడ్డి విజయానికి సంబంధించిన డిక్లరేషన్ ఫాం 22ను ఆయన తరపున న్యాయవాదులు ఎల్ భాస్కర్, జగదీష్‌కు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ మనోజ్‌రెడ్డి మంగళవారం సాయంత్రం అందజేశారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేగౌడ

- రాజకీయాల్లో గెలుపోటములు సహజమే
- గెలిచిన అమరన్నకు అభినందనలు
- ఓడినా ఎప్పటికీ పలమనేరు ప్రజలతోనే ఉంటా
- పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూసినంత మాత్రాన ఇబ్బందేమీ లేదని, ప్రజా తీర్పును గౌరవించి, తాను పలమనేరు నియోజకవర్గ ప్రజలతోనే ఎప్పటికీ ఉంటానని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన నాయకులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నేతలు ఓడిన సందర్భాలున్నాయన్నారు. ఈసారి ఎన్నికల ఫలితాల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి అమరన్నను అభినందిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాల ఫలాలను అందజేసిందని, అయితే ఆ ఫలాలు పొందిన వారి ఆదరణ ఏమైందనేది తెలియడం లేదన్నారు. మొత్తం మీద రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టిన నేపథ్యంలో మేనిఫెస్టోలో టీడీపీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇకపై ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాడేందుకు తాము సిద్ధంగా ఉంటామని, టీడీపీ అభ్యర్థి గెలిచిన ఆనందంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందంలో ఉన్నారని, వారెవరైనా రెచ్చగొట్టే చర్యలకు దిగినా వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు సంయమనాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనవసరమైన గొడవల జోలికి పోరాదన్నారు. ప్రజా తీర్పే ప్రజాస్వామ్యంలో శిరోధార్యం కాబట్టి తాము టీడీపీ గెలుపును స్వాగతిస్తూ ప్రజలకు మేలు చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, సీనియర్ నాయకులు రహీంఖాన్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పలమనేరులో ఎవరికెన్ని ఓట్లంటే..!

- ఎన్నికల బరిలో అభ్యర్థులు 14మంది
- నోటాకు 2,344 ఓట్లు

ఓటింగ్ వివరాలు	
మొత్తం ఓటర్లు	: 2,67,876
పోలైన ఓట్లు మొత్తం	: 2,35,476
పురుషులు	: 1,17,614
మహిళలు	: 1,17,862
పోలింగ్ శాతం	: 87.9

పలమనేరు: మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల్లో మాజీమంత్రి అమర్‌నాథ రెడ్డి 20,122 వేల ఓట్లతో తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడపై భారీ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 14మంది బరిలో ఉండగా వీరిలో పదిమంది ఇండిపెండెంట్లుగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్‌కు 4,015 ఓట్లు రావడం, నోటాకు 2,344 ఓట్లు పడడడం గమనార్హం! శివశంకర్ వైఎస్సార్ సీపీ ఓట్లను చీల్చడంతో టీటీడీ అభ్యర్థికి 20వేల పైచిలుకు మెజార్టీ రావడానికి కారణమైందని చెప్పొచ్చు. లేదంటే మెజార్టీ తగ్గి ఉండేదని రాజకీయ విశ్లేషకుల అంచనా.

వివిధ రాజకీయ పార్టీల నుంచి నలుగురు, ఇండిపెండెంట్లు పదిమంది మొత్తం 14మంది పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎన్ వెంకటేగౌడ(ఫ్యాను)1,03,110 ఓట్లు, టీడీపీ అభ్యర్థి ఎన్ అమర్‌నాథ రెడ్డి(సైకిల్)కి 1,23,232, కాంగ్రెస్ అభ్యర్థి బి.శివశంకర్(హస్తం) 4,015, బీఎస్పీ అభ్యర్థి శోభ,(699) చిరుత్తై కచ్చి అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 251 ఓట్లు పడ్డాయి. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన అమరనాథ్‌రెడ్డి(పెన్‌స్టాండ్) 127, అమరనాథ్ రెడ్డి ఆర్ (బకెట్)174, అరుణ్‌కుమార్(కరెంట్ స్తంభం) 654, సుబ్రమణ్యం(డిష్ యాంటెన్నా) 188, ఉమామహేశ్వర్‌రెడ్డి (ఫ్రై పాన్)156, దామోదర్ నాయుడు(విజిల్)167, కావలి పవిత్ర(గన్నా కిసాన్)193, బొమ్మనపల్లి లక్ష్మన్న(గాజు గ్లాసు)1081, బాషాకు 159, నోటాకు 2324 ఓట్లు పడ్డాయి.

వైభవంగా ప్రదోష పూజలు


నందీశ్వరునికి విశేష హారతి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి, వాల్మీకేశ్వరుడికి ఏక కాలంలో అభిషేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతు

పలమనేరు: పలమనేరు శాసనసభకు జరిగిన ఎన్నికల ఫలితాల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇక స్వతంత్ర అభ్యర్థులకంటే నోటాకే ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం! పలమనేరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,67,876 ఉండగా పోలైన ఓట్లు మొత్తం 2,35,476 (87.9 శాతం)గా ఉంది. ఈ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డికి 52.09శాతం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడకు 43.59 రాగా కాంగ్రెస్‌కు 1.7శాతం, నోటాకు 0.99 శాతం నమోదైంది. ఇందులో విజేతకు పోలైన ఓట్లలో ఒకింత మూడోవంతు ఓట్లు పడితేనే డిపాజిట్ వచ్చినట్టు. అయితే పోటీ నిచ్చిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి మినహా మిగిలిన 12 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కోల్పోయారు. ఇలా ఉండగా 2014 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 2,55,870 ఉండగా, ఆ ఎన్నికల్లో 2,19,519 (85.79) శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి 2.2 శాతం ఓట్ల శాతం పెరిగింది.

2014 పలమనేరు అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా...

ఎస్ వెంకటేగౌడ (వైఎస్సార్‌సీపీ) 1,16,683 (54.45%) సాధించగా, టీడీపీ అభ్యర్థి అమరనాథ రెడ్డి (టీడీపీ) 85,738 (40%) మాత్రమే దక్కించుకుని 33 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో (జనసేన)4175 (1.95%) (కాంగ్రెస్) 1786 (0.83%) ఈశ్వర్ రెడ్డి(బీజేపీ) 1122 (0.52%) అప్పట్లో బీజేపీ, జనసేన జతకట్టకుండా బరిలో దిగినా వీరి ఓటింగ్ మొత్తం కేవలం 2.47శాతం మాత్రమే. కానీ ఈసారి ఎన్నికల్లో కూటమికి పోలింగ్ శాతం పెరిగింది.

గంగమ్మకు కరెన్సీ నోట్ల అలంకరణ

– భక్తులతో కిటకిటలాడిన ఆలయం


కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: కరుణించి కాపాడు... గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం మంగళవారం సర్వాంగసుందర అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను కోరి ప్రార్థించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి ప్రార్థించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మారుపొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన రెండో మంగళవారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టారు. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి, దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. రెండో మంగళవారం కావడంతో ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ కరెన్సీ నోట్లు పుష్పాలతో గంగమ్మ తల్లిని ధనలక్ష్మీ రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి, కొలువుదీర్చి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు మంగళవారం వయోబేధం లేకుండా భక్తిశ్రద్ధలతో గంగవేషాలు ధరించి, ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబలి పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఈఓ కె.మమత, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ సాగుకు రైతన్నలు సిద్ధం!

- పలమనేరు డివిజన్‌కు 10,380 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- వర్షాల రాకతో వేరుశనగ దుక్కులకు సిద్ధమవుతున్న రైతన్నలు


చేను దున్నుతున్న రైతన్న

పలమనేరు: జిల్లాలోనే వేరుశనగ సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతం పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్. ఇక్కడ మెట్ట భూములు ఎక్కువగా ఉండడంతో వర్షాధారంపై పంటలు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగను ఎక్కువగా సాగు చేస్తుంటారు.నె రుతు రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నకాలకు పూనుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు పొందారు. ఈ వర్షాల మూలాన రైతులు అదునులో విత్తనాలేసేందుకు అవకాశం లభించింది. దీంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ...

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని ఏడు మండలాలున్నాయి. ఇక్కడ వేరుశనగ సాధారణ సాగు 14,388 వేల హెక్టార్లుగా ఉంది. ఇప్పటికే ఈ డివిజన్‌కు 10,380 క్వింటాళ్లకే-6 రకం విత్తనాలను వ్యవసాయశాఖ రైతులకు పంపిణీ చేసింది.

సలహాలు-సూచనలను పాటిస్తే మంచి దిగుబడి


అన్నపూర్ణదేవి,అగ్రికల్చర్ ఏడీ, పలమనేరు

వేరుశనగ పంట సాగు విషయంలో రైతులు తమ సలహాలు-సూచనలు పాటిస్తే మంచి పంట దిగుబడి వచ్చి లాభదాయకంగా ఉంటుందని పలమనేరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అన్నపూర్ణదేవి తెలిపారు.

- జూన్ నెలాఖరు నుంచి జూలై 15 వరకు విత్తనాలను వేసుకునేందుకు అదును
- ఎకరాకు 50 కిలోల విత్తనాలను మాత్రమే వేసుకోవాలి.
- సరైన విత్తన మోతాదుతో మొక్కకు-మొక్క మధ్య దూరం ఉంటే మంచి దిగుబడి వస్తుంది.
- కిలో వేరుశనగ విత్తనాలకు 4గ్రాముల ట్రై కోడర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- దీంతో మొదలుకుళ్లు, కాండం కుళ్లు, వేరు కుళ్లను అరికట్టవచ్చు.
- సాలు-సాలుకు మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కకు, మొక్కకు మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా చూడాలి.
- విత్తనం 5 సెం,మీ లోతులోపు పడేలా చూడాలి లేకుంటే మొలక శాతం తగ్గుతుంది.
- ఈ ప్రాంత భూసార పరీక్షల మేరకు ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 70 కిలోల సూపర్ ఫాస్పేట్, 33 కిలోల పొటాష్, 23 కిలోల యూరియాను వాడాలి.
- విత్తే సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సం వాడాలి. దీంతో వర్షాభావం నుంచి పంటను కాపాడుకోవచ్చు.
- విత్తిన 25 రోజుల లోపు గొర్రుతో అంతర పనులు చేయాలి, ఆపై ఊడలు దిగుతాయి. అంతర సేద్యం చేయకూడదు.
- అంతర పంటలుగా 7:1తో అలసంద, జొన్న, మినుము, అనప, బీన్సు మొదలైనవి సాగు చేసుకోవచ్చు.
- పొలం చుట్టూ నాలుగు వరుసలు జొన్న, సజ్జలను వేస్తే వైరస్ తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది.

చిత్తూరు సీటు టీడీపీ కైవసం

- ఎమ్మెల్యేగా గురజాల జగన్‌మోహన్ గెలుపు
- టీడీపీకి 88,066.. వైఎస్సార్‌సీపీకి 73,462 ఓట్లు
- 14,604 ఓట్ల మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి



జీజేఎం తరపున డిక్లరేషన్ అందుకుంటున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. టీడీపీ నుంచి పోటీ చేసిన గురజాల జగన్‌మోహన్‌నాయుడు (జీజేఎం) 88,066 ఓట్లు సాధించి 14,604 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంసి.విజయానందరెడ్డికి 72,399 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం చిత్తూరులోని ఎస్వీ-సెట్ కళాశాలలో జరిగిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఫలితాలు వెలువరించారు. కాగా జీజేఎం తరపున టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్ డిక్లరేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు చేతులమీదుగా అందుకున్నారు.

మొదటి నుంచి ఆధిక్యం..

చిత్తూరు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి జీజేఎం తొలి నుంచి ఆధిక్యం ప్రదర్శించారు. నియోజకవర్గంలో మొత్తం ఈవీఎంల ద్వారా 1,64,260 ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కించడానికి మొత్తం 17 రౌండ్లను ఏర్పాటు చేశారు. తొలిరౌండ్‌లో 1,344 ఓట్ల మెజారిటీ కైవసం చేసుకున్న టీడీపీ అభ్యర్థి.. ఆపై ప్రతి రౌండ్‌లోనూ పైచేయి సాధించారు. చివరి రౌండ్ పూర్తయ్యేసరికి 13,335 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక పోస్టల్‌బ్యాలెట్‌లో చెల్లుబాటు అయిన 3,529 ఓట్లలో టీడీపీకి 2,332, వైఎస్సార్‌సీపీకి 1,063 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా టీడీపీ అభ్యర్థికి 88 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

తొలి పోటీలో గెలుపు..

గురజాల జగన్‌మోహన్‌నాయుడు రాజకీయాలకు కొత్త. ఆర్నెళ్ల క్రితం చిత్తూరు రాజకీయ చిత్రపటంలో ఓ పరిచయంలేని వ్యక్తిగా వచ్చిన జీజేఎం.. అప్పటి వరకు ఇక్కడి టీడీపీలో ఉన్న అసమ్మతిని ఒక్క తాటిపైకి తీసుకురావడంలో విజయం సాధించారనే చెప్పొచ్చు. అప్పటి వరకు టీడీపీలో టికెట్ కోసం మాజీ మేయర్ హేమలత, డీకే ఆదికేశవులునాయుడు కుటుంబం, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ముమ్మరంగా ప్రయత్నించారు. ఆర్థికంగా బలమైన నేతగా జీజేఎంను టికెట్ వరించింది. గత అయిదేళ్లుగా సేవా కార్యక్రమాలతో చిత్తూరు వాసులకు దగ్గరైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి పోటీగా జీజేఎం బరిలోకిదిగి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోటీ చేసిన తొలి ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం..

చిత్తూరు వాసులకు ఏవైతే హామీలు ఇచ్చామో వాటిని నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నాం. చిత్తూరు అభివృద్ధిని నా వంతు కృషి చేస్తా

–గురజాల జగన్‌మోహన్‌నాయుడు

ఎవరికి ఎన్ని పడ్డాయంటే..

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు (పోస్టల్ బ్యాలెట్)
జగన్‌మోహన్ నాయుడు	టీడీపీ	88,066
విజయానందరెడ్డి	వైఎస్సార్‌సీపీ	73,462
టికారామ్	కాంగ్రెస్	3,264
లోకనాథం	బీఎస్పీ	621
రమణారెడ్డి	జన్‌సంఘ్	221
రవి	జైభీమ్	85
సరిత	సమాజ్‌వాది	50
అన్వేష్	స్వతంత్ర	82
విజయ్‌కుమార్	స్వతంత్ర	64
తేజేష్	స్వతంత్ర	212
పురుషోత్తం	స్వతంత్ర	120
ప్రభాకర్‌రెడ్డి	స్వతంత్ర	62
రియాజ్‌భాష	స్వతంత్ర	404
నోట	-	1096
మొత్తం	-	1,67,789

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తల దాడి

- దళితుల ఇళ్లల్లోకి వెళ్లి దాడులు చేసిన అగ్రవర్ణాలు
- పలువురికి తీవ్రగాయాలు
- మొగిలివారిపల్లెలో టీడీపీ అరాచకం



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన అరుణకుమార్, తలకు తీవ్రగాయమైన రాజు

బంగారుపాళెం: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఫలితాలు వెల్లడి కావడంతో ఆ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. దళితుల ఇళ్లల్లోకి దౌర్జన్యంగా వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. మండలంలోని మొగిలివారిపల్లెలో అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం దాడులకు తెగబడ్డారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీకి చెందిన అగ్రకులస్తులు గ్రామంలోని దళితుల ఇళ్లల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. అరుణకుమార్, రాజు, హరిష్‌తో పాటు పలువురు గాయపడ్డారు. అడ్డు వచ్చిన వారిపై పేట్రేగిపోయారు. గాయపడిన వారిని స్థానికులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరుణకుమార్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టీడీపీ కార్యకర్తలు దళితులపై దాడులతో గ్రామస్తులు హడలిపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని మహిళలు, వృద్ధులు, పిల్లలు బిక్కుబిక్కుమని ఉంటున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. మళ్లీ దాడులు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

టీడీపీ దౌర్జన్యకాండ

పూతలపట్టు: పూతలపట్టులో టీడీపీ దౌర్జన్యకాండ మొదలైంది. టీడీపీ అభ్యర్థి గెలుపుతో తమ్ముళ్లు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. వారి ఇళ్లల్లోని వస్తువులను ధ్వంసం చేశారు. అలాగే మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని నేలమట్టం చేశారు. పూతలపట్టు మండలంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తెలుగు తమ్ముళ్లు వీరంగం సృష్టించారు. పలువురినీ రక్తమోడేలా కొట్టారు. మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద తేనేపల్లె ఉపసర్పంచ్ నందయ్యను బెదిరించారు. ఆపై దుకాణాన్ని ధ్వంసం చేశారు. అనంతరం బైకు ర్యాలీ చేస్తూ కర్రలతో వీరంగం సృష్టించారు. దీంతో పాటు ఎగువపాలకూరు దళితవాడలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై ఇళ్లపై కర్రలతో దాడి చేశారు. ఇళ్ల అద్దాలను పగులకొట్టారు. 10 మందిని తీవ్రంగా గాయపరిచారు. పాలకూరులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నేలమట్టం చేశారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసుటు సంఘటన స్థలానికి చేరుకుని కింద పడ్డ విగ్రహాన్ని వైరుతో కట్టి నిలబెట్టారు. దీంతో పాటు వావిల్‌తోట పంచాయతీలోని నయనంపల్లె, వీర్లగుడిపల్లె, కంద్రిగలోని సానుభూతిపరుల ఇళ్లను ధ్వంసం చేశారు. ఏజెంట్‌గా పనిచేసిన హరిబాబుపై దాడి చేసి ట్రాక్టర్‌కు నిప్పంటించారు. ఈ దాడుల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు తీవ్రగాయాలు కావడంతో పాటు రూ.లక్షల విలువ చేసే ఆస్తులు ధ్వంసమయ్యాయి. ప్రజలు భయంతో వణికిపోతున్నారు. దాడులపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని పోలీసులు చెప్పారు.